సాక్షి రంగారెడ్డి

శనివారం । 19 । జూలై । 2025



వంతెన పూర్తి చేయాలి

చర్లగూడ వంతెన పనులను పూర్తి చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

చరికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కలెక్టర్‌ని కోరారు. 8లో▸



అజీజ్‌నగర్‌లో భారీ చోరీ

ఇంటితాళాలు పగులగొట్టి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3.70లక్షల నగదు అపహరించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు శంకర్‌పల్లికి రైల్వే మంత్రి రాక



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డివిజనల్ రైల్వే మేనేజర్ బీకే జైన్

శంకర్‌పల్లి: రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ఉదయం 10.30 గంటలకు శంకర్‌పల్లికి రానున్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమం అనంతరం శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కి వచ్చి ప్రత్యేక రైలులో కాజీపేటకు వెళ్లనున్నట్లు రైల్వే అధికారులు, పోలీసులు తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం దక్షిణ మధ్య డివిజినల్ రైల్వే మేనేజర్ బీకే జైన్ శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం: మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి కోసం వచ్చేనెల 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అల్ప సంఖ్యాక వర్గాల జిల్లా సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం మండల స్పెషలాఫీసర్ కె.నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ హైదరాబాద్ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టార్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. కుటుంబ ఆదాయం రూ.ఐదు లక్షల లోపు ఉండి, 26 ఏళ్ల లోపు వయస్సు కలిగి, 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌కు అవకాశం లేదు) పూర్తి చేసిన మైనార్టీ విద్యార్థులు అర్హులని చెప్పారు. గూగుల్ ఫారం ద్వారా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 040-29300461 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్‌టీఐపీసీ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్



నియామకపత్రం అందుకుంటున్న లక్ష్మణ్

ఇబ్రహీంపట్నం రూరల్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన కాకి లక్ష్మణ్ ముదిరాజ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకట్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని అన్నారు.

'ప్రజలదే విజయం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని చూపుతున్న విజయలక్ష్మి కుటుంబ సభ్యులు

కేశంపేట: ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మండల పరిధిలోని వేముల నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె జీవిత చరిత్ర, రాసుకున్న డైరీ ఆధారంగా 'ప్రజలదే విజయం' (కామ్రేడ్ విజయలక్ష్మి అలియాస్ భూమిక కథలు) పుస్తకాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. విమలక్క, శాంత, లక్ష్మణరావు, అంజమ్మ, సాదినేని వెంకటేశ్వరరావు, బాజీరా, పినాకపాణి ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఔటర్‌పై.. ఘోర ప్రమాదం

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..



విలపిస్తున్న జనార్దన్ కుటుంబ సభ్యులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- అతివేగంతో వెళ్లి లారీని ఢీకొట్టిన కారు
- నలుగురు అక్కడికక్కడే దుర్మరణం
- చికిత్స పొందుతూ మరొకరి మృతి
- రెండు గంటలు శ్రమించి మృతదేహాల వెలికితీత
- రోదనలతో మిన్నంటిన ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ

ఇబ్రహీంపట్నం రూరల్/ఇబ్రహీంపట్నం/మొయినాబాద్: బతుకుదెరువుకోసం పొట్ట చేతపట్టుకొని వలస వచ్చారు. నిత్యం పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. దైవ దర్శనం కోసం వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్ రెడ్డి కథనం ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లికి చెందిన కావలి బాల్‌రాజ్ (40) చికెన్‌సెంటర్ నిర్వహిస్తున్నాడు. వరంగల్ జిల్లా మానంపల్లితండాకు చెందిన మాలోతు చందులాల్ (29), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కలంరాజుపేటకు చెందిన జడ కృష్ణ (25) మొయినాబాద్‌లోని డ్రీమ్ వ్యాలీ రిసార్ట్‌లో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా వెదుళ్లవలసకు చెందిన దాసరి భాస్కర్‌రావు (39) డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మహబూబబాద్ జిల్లా దాసరితండాకు చెందిన గుగులోతు జనార్దన్ (45) మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సోలార్ విల్లాస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. బాల్‌రాజ్ నిర్వహిస్తున్న చికెన్ సెంటర్ వద్దకు వీరంతా తరచూ వస్తుండడంతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో అందరూ స్నేహితులుగా మారారు. గురువారం రాత్రి బాల్‌రాజ్ సొంత కారు (టీఎస్ 07 హెచ్‌డబ్ల్యూ 5858) తీసుకొని ఐదుగురూ కలిసి యాదగిరిగుట్టకు వెళ్లారు. దర్శనం అనంతరం శుక్రవారం తెల్లవారు జామున ఘట్కేసర్ నుంచి మొయినాబాద్‌కు ఔటర్‌రింగ్‌రోడు మీదుగా వస్తుండగా బొంగ్లూర్ ఎగ్జిట్ నంబర్ 12కు సమీపంలో 108 కేఎం వద్దకు రాగానే నిద్రమత్తు, అతివేగంతో కారు డ్రైవింగ్ చేస్తున్న చందులాల్ ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. కారు లారీ వెనుకభాగంలో ఇరుక్కుపోవడంతో కారు నుజ్జునుజ్జయింది. జనార్దన్, చందులాల్, బాల్‌రాజ్, భాస్కర్‌రావు కారులోనే ఇరుక్కుపోయి దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు. కృష్ణ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. చందులాల్‌కు జనార్దన్ వరుసకు బాబాయ్ అవుతాడు.



కావలి బాల్‌రాజ్



గుగులోతు జనార్దన్



జడ కృష్ణ



మాలోతు చందులాల్



భాస్కర్‌రావు

వైద్యుల పనితీరుపై మాజీ ఎంపీ ఆగ్రహం

వైద్యుల పనితీరుపై మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోతు కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల్లో మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందినవారు ఉండడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు ఆమె ఉదయం పది గంటలకు ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. అప్పటికి పోస్టుమార్టం కోసం మృతదేహాలను తీసుకెళ్లకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యుడు జవార్‌తో ఫోన్‌లో మాట్లాడగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆమె మండిపడ్డారు. ఉదయం ఆరున్నర గంటలలోపు మృతదేహాలను ఆస్పత్రికి తీసుకొస్తే పదిన్నర గంటలు కావస్తున్నా వైద్యులు అందుబాటులో లేరన్నారు. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫోన్‌లో వివరించారు.

రోదనలతో మిన్నంటిన ఆస్పత్రి ప్రాంగణం

నలుగురి మృతదేహాలను ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులంతా అక్కడికి చేరుకుని అయ్యో దేవుడా ఎంత పని చేశావంటూ బోరున విలపించారు. వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కృష్ణ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేశారు.

బాధితులను ఓదార్చిన డీసీపీ

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, సీఐ రాఘవేందర్‌రెడ్డి ఔటర్‌పై జరిగిన ఘటనను పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి విచ్చేసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్‌రాజ్ కుటుంబంలో విషాదం

చికెన్‌సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న బాల్‌రాజ్ కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. స్నేహితులతో కలిసి వెళ్లిన బాల్‌రాజ్ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాల్‌రాజ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బాల్‌రాజ్ మరణంతో కుటుంబంలో మగదిక్కులేకుండా పోయిందని బంధువులు, మహిళలు బోరున విలపించారు.

బతుకుదెరువుకోసం వచ్చి..

రిసార్ట్స్‌లో డ్రైవర్‌లుగా పనిచేస్తున్న చందులాల్, కృష్ణ, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న భాస్కర్‌రావు, సోలార్ విల్లాస్‌లో కూలీగా పనిచేస్తున్న జనార్దన్ ఇతర ప్రాంతాల నుంచి బతుకుదెరువుకోసం వచ్చారు. కుటుంబాలను వదిలి వచ్చిన వారంతా రోడ్డు ప్రమాదంలో మృతి చెంది కుటుంబాల్లో విషాదాన్ని నింపారు.



మొయినాబాద్‌రూరల్: బాకారం వద్ద కల్వర్టుపై నుంచి ఉప్పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

జోరువాన

జిల్లాలోని పలుప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంటలు నీట మునిగాయి. ప్రహరీలు కూలిపోయాయి. పలు గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. మరోవైపు వర్షాలకోసం నిరీక్షిస్తున్న రైతులకు ఊరటనిచ్చింది.

వివరాలు 8లో▸



మొయినాబాద్: నాగిరెడ్డిగూడ-ఎనికేపల్లి దారిలో కూలిన ప్రహరీ



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ వద్ద వరద



మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలి వద్ద గులాబీ తోటలో చేరిన వరద నీరు

ఇందిరమ్మ ఇళ్లలో పారదర్శకత ఏదీ?

- కాంగ్రెస్ కార్యకర్తలకే అన్నట్లుగా ఉంది
- అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు
- కేంద్ర పథకాలను పక్కాగా అమలు చేయాలి
- చేవెళ్ల ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- సమీక్ష సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తలకే అన్నట్లుగా ఉంది' అని చేవెళ్ల ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో కొనసాగిందని ఆరోపించారు. అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహించారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనర్హులకు ఇళ్లు కేటాయించడంతో వాళ్లు కట్టుకోలేక.. ఈ ఇళ్లు మాకొద్దు అంటూ ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్స్ తిప్పి పంపుతున్నారని గుర్తు చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ)సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయం, పశు సంవర్థకశాఖ, పరిశ్రమలు, బ్యాంకింగ్ రుణాలు, మైనింగ్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖ, పౌర సరఫరాల, శిశు సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మత్స్య, మార్కెటింగ్, గృహ నిర్మాణ శాఖల పనితీరును సమీక్షించారు.

దిశ అంటే ఓ మార్గం.. అభివృద్ధి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దిశ అంటే ఒక మార్గం, అభివృద్ధి అని, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌ల వివరాలను అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో పుట్టగొడుగుల శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా మత్స్యకారులకు చేపలు పట్టే విధానంపై శిక్షణ ఇవ్వక పోవడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు..ఇక్కడికి వచ్చి చెరువులను లీజుకు తీసుకుని లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని మత్స్యకారులకు శిక్షణ ఇప్పించి, ఆర్థికంగా తోడ్పడాలని సూచించారు. కేంద్ర పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు.

నిలదీసిన సభ్యులు..

ఈదురుగాలులతో కూడిన వర్షాలకు పాలిహౌస్‌లు దెబ్బతిన్నాయని, పునరుద్ధరణకు ప్రభుత్వం సాయం చేస్తుందా అని చేవెళ్ల ఎమ్మెల్యే, కమిటీ సభ్యుడు కాలె యాదయ్య ప్రశ్నించారు. మొయినాబాద్, చేవెళ్ల, శంషాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో పూల సాగు అధికంగా ఉంది. రైతులు రాత్రి పూట పూలు కోసి, అదేరాత్రి మార్కెట్‌కు తెస్తున్నారు. అక్కడి ఏజెంట్లు రైతుల నుంచి పది శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. నిలువు దోపిడీ చేస్తున్న ఏజెంట్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. లెనిన్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని రెండేళ్ల క్రితం కూల్చివేశారు. ఇప్పటికీ భవనం పూర్తి చేయలేదు అప్పటి వరకు అక్కడ చదువుకునే పిల్లలంతా చెల్లా చెదురైపోయారు అని మరో సభ్యుడు ఎ.శ్రీనివాస్ అన్నారు. ఇన్నర్ టు ఔటర్‌ను కలిపే పలు మార్గాలు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయని, ఆ రహదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని సభ్యుడు తోకల శ్రీనివాసరెడ్డి కోరారు. పశు సంవర్థకశాఖ కమిటీకి సమర్పించిన నివేదిక అసమగ్రంగా రూపొందించడంపై కలెక్టర్ నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమావేశానికి తప్పని కరెంట్ కటకట

అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సభ్యులంతా సీరియస్‌గా చర్చిస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కీలక సమావేశం జరుగుతున్న సమయంలో పలు మార్లు రెంట్ నిలిచిపోవడంపై సభ్యులు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: మున్సిపల్ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో ఆగస్టు 2న జరిగే సీపీఐ జిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద సంవత్సరాల భారత కమ్యూనిస్టు పార్టీ నాటి నుంచి నేటి వరకు భూమి, భుక్తి, విముక్తికోసం పేదల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. పోరాటమే ఎజెండాగా జరుగనున్న జిల్లా మహాసభలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పర్వతాలు, రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, అంజయ్య, మంజుల, సుధాకర్‌గౌడ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయండి

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులకు సమన్యాయం చేయాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఈమేరకు శుక్రవారం రైతులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పరిహారం కోసం రైతులు రిలే దీక్ష చేస్తుంటే కొంత మందిని విడదీసి పట్టాలు ఇవ్వడం సరికాదన్నారు. రైతులను ఒప్పించి వారికి సరైన పరిహారం ఇవ్వాలన్నారు. కలెక్టర్‌ను కలిసినవారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మోర నర్సింహారెడ్డి, నాయకులు వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

భూములు పరిశీలించిన సీపీఎం నాయకులు

ఎనికేపల్లి రైతులకు ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రైతులు చేపడుతున్న రిలే దీక్షలో శుక్రవారం ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేటు గోశాలకు ప్రభుత్వం 99.14 ఎకరాల భూములు ఇవ్వడం సరికాదన్నారు. తరతరాలుగా భూమినే నమ్ముకుని జీవనాధారం పొందుతున్న పేద రైతుల నోట్లో మట్టి కొట్టొద్దన్నారు. పేదల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కొని బడాబాబులకు కట్టబెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, జగదీష్, నాయకులు జగన్, ప్రకాష్ కారత్, అల్లి దేవేందర్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటయ్య, అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



రైతులతో కలిసి భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి



మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: ఫ్యూచర్‌సిటీలో మహిళా సంఘాలకు వంద ఎకరాలు కేటాయించి, వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. ఇందిర మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను కోటీశ్వరుల్ని చేస్తానని చెబుతున్నారని, ఒక్కో మహిళకు రూ.కోటి రుణం ఇచ్చినప్పుడే అది సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం మాటలతో కడుపు నింపే ప్రయత్నం చేస్తోందని, నిజంగా ఆడబిడ్డలపై ప్రేముంటే మూడేళ్లకాలం వడ్డీని వెంటనే విడుదల చేయాలన్నారు. మహిళలు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని, బ్యాంక్ లింకేజీతో సంబంధం లేకుండా రుణాలు ఇవ్వాలని, సీనియర్ సిటిజన్లతో సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, ఏపీఎంలు కవిత, సత్యనారాయణ, ఎంపీఓ గీత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతన్న హర్షం

- మొయినాబాద్‌లో కుండపోత
- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- కూలిన ప్రహరీలు.. విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు


చేవెళ్ల: రోడ్డుపై పారుతున్న వరద


మీర్‌పేట: మిథులానగర్‌లో వరద ప్రవాహం


మొయినాబాద్: బాకారం ఎర్రకుంట వాగు పొంగి రోడ్డుపై పారుతున్న వరద


మొయినాబాద్: ఠాణా వెనుక భాగంలో కూలిన ప్రహరీ, వృక్షం


మొయినాబాద్: అమ్డాపూర్ వద్ద ఈసీ వాగులో పారుతున్న వరద

చేవెళ్ల: ఎట్టకేలకు రైతు ఎదురుచూపులను వరుణ దేవుడు కరుణించాడు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోడ్లన్నీ జలమయ్యమయ్యాయి. ఆలూరు రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బంది పడ్డారు. చేవెళ్లలో రోడ్లుపై వర్షపు నీరు పారింది. ఎస్సీ వసతి గృహం ఎదుట, చేవెళ్ల దేవాలయ కమాన్ ఎదుట నీరు నిలిచి చెరువును తలపించింది.

పది సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

మొయినాబాద్: అర్ధరాత్రి కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. మూడు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లాయి. పలు చోట్ల వరద తాకిడికి ప్రహరీలు కూలాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. భారీగా వరదలు రావడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మొయినాబాద్ మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల వరకు ఏగదాటిగా 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తిరిగి సాయంత్రం 5గంటల నుంచి 7.30గంటలకు మరో వారు వాన జోరు చూపింది. భారీగా వరదలు రావడంతో కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో నిర్మించిన ప్రహరీలు కూలిపోయాయి. నాగిరెడ్డిగూడ, ఎనికేపల్లి దారి పక్కన నిర్మించిన ప్రహరీ గోడ వరద తాకిడికి కూలింది. ముర్తూజగూడ నుంచి డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్స్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల నిర్మించిన ప్రహరీ కూలిపోయింది. మొయినాబాద్ ఠాణా వెనుక ప్రహరీ గోడ కూలిపోయింది. ఇంత వర్షం 40 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదని స్థానికులు వాపోయారు. నాగిరెడ్డిగూడ, బాకారం, అమ్డాపూర్, వెంకటాపూర్, శ్రీరాంనగర్ గ్రామాలతోపాటు మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం గ్రామాల్లో ప్రీకాస్ట్ వాల్స్ కూలిపోయాయి. ఆయా ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శ్రీరాంనగర్ బోయవాగు, అమ్డాపూర్ పీతవాగు, బాకారం ఎర్రకుంట వాగు, నాగిరెడ్డిగూడ అబ్బుకుంట వాగుల్లో భారీగా వరదలు పారాయి. ఆయా వాగుల నుంచి ఈసీ వాగులోకి వెళ్లిన వరదనీరు హిమాయత్‌సాగర్ జలాశయంలోకి చేరింది. పలు చోట్ల కల్వర్టులపై నుంచి వరదనీరు పొంగి పొర్లింది. రోడ్లపైనుంచి వరదల పారడంతో నాగిరెడ్డిగూడ–బాకారం, అమ్డాపూర్–కాశీంబౌలి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై అజీజ్‌నగర్‌చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, భాస్కర ఆసుపత్రి, బోస్ గార్డెన్, మొయినాబాద్‌లలో భారీగా వర్షం నీరు నిలిచింది. ఆయా ప్రాంతాల్లో కల్వర్టులు మూసివేయడంతో వరద నీరు రోడ్డుపై నిలిచిపోయింది. భారీ వరదలతో పలు గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై నుంచి వరదలు పారడంతో రోడ్డు, మట్టి కొట్టుకుపోయాయి. కొన్ని చోట్ల పంటలను నీట మునిగి దెబ్బతిన్నాయి.

తెగిన ఎర్రకుంట కట్ట

మొయినాబాద్ రూరల్: శుక్రవారం ఉదయం, సాయంత్రం 3గంటల నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. నీటితో నిండిన బాకారం ఎర్రకుంట చెరువు ఒక్కసారిగా తెగిపోయి కుంటలోని నీరంతా పల్లానికి ప్రవహించింది. దీంతో బాకారం, ఎన్కేపల్లి రహదారి దాదాపు రెండు గంటల పాటు నిలిచిపోయింది. వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ పరమేశ్వరచారి బాకారంలోని ఎర్రకుంటను సందర్శించి పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కట్టకు మరమ్మతులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. దీంతో గ్రామాలు తడిసిముద్దైయ్యాయి. రోడ్లన్ని జలమయమైయ్యాయి. తెల్లవారుజామున కురిసిన వర్షానికి అప్పటికే వర్షం నీటితో నిండి ఉన్న రోడ్లు, గుంతలు సాయంత్రం కురిసిన వర్షానికి మరింత వర్షం నీరు చేరింది.


మొయినాబాద్‌రూరల్: బాకారం ఎర్రకుంట తెగిపోవడంతో కిందకు ప్రవహిస్తున్న వరద


ఇబ్రహీంపట్నం రూరల్: అలుగుపారుతున్న జిలాన్‌ఖాన్ వాగు

షాద్‌నగర్‌లో సహాయక చర్యలు

షాద్‌నగర్: పట్టణంలో భారీగా వర్షం కురియడంతో లోతట్టుకాలనీలు జలమయమయ్యాయి. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాలనీల్లో మురుగు కాల్వలు ఉప్పొంగాయి. వర్షం నీరు ఇళ్లలోకి చేరయడంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ సునీత పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. బీజేపీ నేత అందె బాబయ్య నాయకులు లోతట్టు కాలనీల్లో పర్యటించారు.


ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

మెట్ట పంటలకు జీవం

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం సమయాల్లో మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షంతో మెట్ట పంటలకు భారీ ఉపశమనం లభించింది. పక్షం రోజులుగా వర్షాలు లేక పత్తి, కంది, జొన్న, మొక్కజొన్న తదితర మెట్ట పంటలు వాడిపోయే దశకు చేరాయి. రెండు రోజులుగా కురిసిన వర్షంతో మెట్ట పంటలకు జీవం పోసినట్లయింది. యాచారం, అయ్యవారిగూడెం, నందివనపర్తి, మొండిగౌరెల్లి, చింతపట్ల తదితర గ్రామాల్లో రెండు గంటల పాటు వర్షం కురిసింది.

నీటమునిగిన కాలనీలు

మీర్‌పేట: శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. మిథులానగర్, కమలానెహ్రూనగర్ కాలనీలను వరదనీరు ముంచెత్తడంతో వీధుల్లో మోకాలి లోతు వరకు నీరు చేరాయి. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

మంగళ్‌పల్లిలో అత్యధిక వర్షపాతం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. మూడు గంటలకు పైగా ఆగకుండా వర్షం కురవడంతో రోడ్లుపై వరదలు పారాయి. కొంగరకలాన్‌లోని ఇళ్లలోకి నీరు చేరింది. పెద్దబంధం కాల్వ నుంచి దాతార్ చెరువులోకి భారీగా వరద నీరు రావడంతో కొంగరకలాన్–ఎలిమ్నేడు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లిలో 85.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


చేవెళ్ల: ఎస్సీ హాస్టల్ ఎదుట నిలిచిన వర్షపు నీరు


షాద్‌నగర్: ఢిల్లీ వరల్డ్ పాఠశాల వద్ద నిలిచిన వర్షం నీరు


షాద్‌నగర్: పటేల్‌రోడ్డు కాలనీలో నిలిచిన వరదనీరు వెళ్లేలా పనులు చేపట్టిన సిబ్బంది


ఇబ్రహీంపట్నం రూరల్: పెద్దబంధం నుంచి దాతార్ చెరువులోకి ప్రవహిస్తున్న వరద


మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

మద్యానికి బానిసైన వ్యక్తి బలవన్మరణం

చేవెళ్ల: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల మనోహర్‌చారి(40) ఆరు నెలలుగా ఏ పని చేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోడకూలి మహిళ మృతి


లక్ష్మి మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: గుడిసెలో నిద్రిస్తున్న మహిళ గోడకూలి దుర్మరణం చెందింది. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్ లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలను ఆనుకుని ఎల్‌ఆర్ ఎన్‌క్లేవ్ వెంచర్ ఉంది. అందులో నల్గొండ జిల్లా కొత్తూరు తండా, అడవిదేవిపల్లికి చెందిన రమావత్ లక్ష్మి(38), శంకర్ దంపతులు గుడిసె వేసుకుని సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. లక్ష్మి గుడిసెలో నిద్రిస్తున్న సమయంలో భారీ వర్షం కారణంగా ఎంవీఎస్‌ఆర్ కళాశాల ప్రహరీ కూలి గుడిసెపై పడింది. ఈ ఘటనలో గుడిసెలో నిద్రిస్తున్న లక్ష్మిపై మట్టి పెల్లలు, రాళ్లు పడటంతో మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు ఆదిబట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం ఘటనలో ముగ్గురికి రిమాండ్

షాద్‌నగర్‌రూరల్: వ్యక్తిగత కక్షలతో కాంగ్రెస్ నాయకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో శుక్రవారం పోలీసులు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చిల్కమర్రిలో బోనాల ఉత్సవాల నిర్వహణకోసం నాలుగు రోజుల క్రితం గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన హరికృష్ణారెడ్డి మద్యంమత్తులో అక్కడికి వచ్చి గ్రామస్తులపై దుర్భాషలాడాడు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నేత చిల్కమర్రి రవీందర్‌రెడ్డి విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలో బోనాల పండగలో ఎలాంటి ఘటనలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో మొదటి బోనాల పండుగ రోజు హరికృష్ణారెడ్డిని పోలీసులు ఠాణాకు పిలిపించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న హరికృష్ణారెడ్డి సోదరుడు శివకృష్ణారెడ్డి రెండవ రోజు బోనాల ఉత్సవాలలో పాల్గొన్న చిల్కమర్రి రవీందర్‌రెడ్డిపై బ్లేడుతో దాడిచేసి గొంతు కోశాడు. రవీందర్‌రెడ్డి సోదరుడు సురేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు హరికృష్ణారెడ్డి, శివకృష్ణారెడ్డితో పాటు వారి తండ్రి బాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం తండ్రి బాల్‌రెడ్డితో పాటు హరికృష్ణారెడ్డి, శివకృష్ణారెడ్డిలను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మేకల మందపై దాడి చేసింది చిరుతలు కాదు

మహేశ్వరం: బాలాపూర్ మండలం మల్లాపూర్‌లో మేకలమందపై దాడి చేసింది చిరుతలు కాదని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.రాజేందర్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం రాత్రి మల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు బాబుకు సంబంధించిన 16 మేకలు గొంతు కొరకబడి మృతి చెందాయి. ఇటీవల ఆర్సీఐలో చిరుతల సంచారం అంటూ వదంతులు రావడం.. ఈ క్రమంలో సమీపంలోని గ్రామంలో మేకలు చంపబడడంతో చిరుతలు చంపి ఉంటాయని స్థానిక ప్రజల్లో ఆందోళన మొదలయింది. విషయం తెలుసుకున్న బాలాపూర్ పోలీసులు ఫారెస్ట్ అధికారులను పిలిపించి స్థానికంగా అడుగు జాడలతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. చిరుతలు, ఇతర క్రూర మృగాలకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. వీధికుక్కలు దాడి చేసి చంపినట్లుగా తెలుస్తోందన్నారు. ఈ విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని.. ఏదైనా సమాచారం ఉంటే సోషల్ మీడియాలో కాకుండా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వదంతులు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యం


బేగరి నర్సింలు(ఫైల్)

చేవెళ్ల: భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని రంగారెడ్డి కాలనీలో గురువారం చోటు చేసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఆయన సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. రంగారెడ్డి కాలనీకి చెందిన బేగరి నర్సింలు, శాంతమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి సైతం ఇద్దరూ గొడవపడ్డారు. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన నర్సింలు రాత్రైనా తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య శాంతమ్మపైనే అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

చర్లగూడ వంతెన పనులు పూర్తి చేయాలి


షాబాద్: కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆంజనేయులు తదితరులు

మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు


షాబాద్: చర్లగూడ వంతెన, రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సంఘం నాయకులతో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. చర్లగూడ గ్రామ బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో ప్రజలకు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. మూడేళ్లుగా 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలకు విద్యార్థులకు, రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గతంలో ఈ వాగులో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని గుర్తు చేశారు. చర్లగూడ బ్రిడ్జి, రోడ్డుకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు చంద్రశేఖర్, మల్లేశ్, అంజయ్య, సత్యనారాయణ, కృష్ణ, రాజు, శేఖర్ తదితరులున్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించండి

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని చరికొండ గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. పాఠశాలలో గణిత, భౌతిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు వెంకటయ్య, మహేందర్‌గౌడ్, కాటం ఉన్నారు.

అర్హులందరికీ ఆర్థికసాయం

మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణి


లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న ఏఓ తదితరులు

యాలాల: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కొత్త ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల విచారణను శుక్రవారం చేపట్టారు. గోవిందరావుపేట విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, నర్సింలు, చందు, ఉమేశ్, రాజు, లాలు, లక్ష్మప్ప, బుడ్డప్ప తదితరులు ఉన్నారు.

అజీజ్‌నగర్‌లో భారీ చోరీ

తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3.70లక్షల నగదు అపహరణ

మొయినాబాద్: గుర్తుతెలియని దుండగులు ఇంటితాళాలు, బీరువా తాళాలు పగులగొట్టి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3.70లక్షల నగదు అపహరించారు. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. అజీజ్‌నగర్‌కు చెందిన బొర్ర జంగయ్యది వ్యవసాయ కుటుంబం. అమీర్‌గూడలో బోనాల పండుగ ఉండటంతో బుధవారం భార్య, పిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం జంగయ్య తిరిగి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు ఇంటి దగ్గరే ఉండి 12 గంటల సమయంలో పని మీద తుక్కుగూడకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చాడు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి రెండు బీరువాల తాళాలు విరగొట్టి కనిపించాయి. బీరువాలో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.3.70లక్షల నగదు కనిపించకపోవడంతో ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం పోలీసులు ఇంటి చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను గుర్తించే ప్రయత్నం చేసినా ఆధారాలు లభించలేదు.